క్లుప్తంగా

'హరీశ్‌రావు ఉద్యోగులకు క్షమాపణ చెప్పాలి'

చేగుంట(తూప్రాన్‌): ఎమ్మెల్యే హరీశ్‌రావు ఉద్యోగులకు క్షమాపణ చెప్పాలని పీఆర్టీయూ తెలంగాణ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు పరమేశ్వర్‌రెడ్డి డిమాండ్‌ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్‌ హయాంలో ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకుండా వేతనాలు సైతం సక్రమంగా అందించలేదన్నారు. కొత్త ప్రభుత్వం ప్రతీనెల వేతనాలు సక్రమంగా అందిస్తుంటే ప్రభుత్వ ఉద్యోగుల జీతాలను ఆపి ఇతర పథకాలకు డబ్బు ఖర్చుచేయాలని హరీశ్‌రావు మాట్లాడటం సరికాదన్నారు. బీఆర్‌ఎస్‌ పాలనలో అన్ని వర్గాల ప్రజలు నిరుద్యోగులు ఎంతో నష్టపోయారని దానిని తప్పించుకునేందుకు హరీశ్‌రావు ఉద్యోగులపై చౌకబారు వ్యాఖ్యలు చేస్తున్నారని పేర్కొన్నారు.

14న ఎమ్మార్పీఎస్‌ సదస్సుకు తరలిరండి

వెల్దుర్తి(తూప్రాన్‌): మెదక్‌ టీఎన్‌జీఓ భవన్‌లో ఈ నెల 14న నిర్వహించే ఎమ్మార్పీఎస్‌ పార్లమెంట్‌ నియోజకవర్గ సదస్సును జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా సీనియర్‌ నాయకుడు మాసాయిపేట యాదగిరి, జిల్లా అధ్యక్షుడు చెట్లపల్లి యాదగిరి పిలుపునిచ్చారు. మండలకేంద్రం మాసాయిపేటలో వారు మాట్లాడుతూ.. సమావేశానికి సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. జిల్లాలోని ఎమ్మార్పీఎస్‌, ఎంఎస్పీ, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరారు. మహిళా సమాఖ్య జిల్లా అధికార ప్రతినిధి శోభ, వినోద్‌, పరమేశ్‌, విశాల్‌ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న గ్రామ నాయకులు

చిన్నశంకరంపేట(మెదక్‌): మండలంలోని సూరారం గ్రామంలో మెదక్‌ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌ సహకారంతో మంజూరైన ఈజీఎస్‌ నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తాజామాజీ సర్పంచ్‌ పవన్‌, ఉపసర్పంచ్‌ గోవర్ధన్‌రెడ్డి, పీఏసీఎస్‌ చైర్మన్‌ సత్యనారాయణ, మాజీ సర్పంచ్‌ నాగరాజు, కాంగ్రెస్‌ నాయకులు రాజ్‌కుమార్‌, రామాస్వామి పాల్గొన్నారు

పోలీస్‌ కవాతు



కవాతు నిర్వహిస్తున్న జవాన్లు

చిన్నశంకరంపేట(మెదక్‌): పార్లమెంట్‌ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో శుక్రవారం మండల కేంద్రంలో పోలీస్‌ కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ నారాయణగౌడ్‌ మాట్లాడుతూ.. రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా ఎస్పీ బాలస్వామి ఆదేశాలతో పారామిలటరీ బలగాలతో కవాతు నిర్వహించినట్లు తెలిపారు. శాంతి భద్రతల రక్షణకు పోలీస్‌ వ్యవస్థ ముందుండి ప్రజాస్వామ్య వ్యవస్థను ముందుకు తీసుకెళ్లేందుకు శాంతియుత వాతావరణం కోసం కృషి చేస్తున్నట్లు చెప్పారు.

ప్రధాన మంత్రి మోదీతోనే దేశానికి భద్రత



నియామక పత్రం అందుకుంటున్న యాదగిరి

అల్లాదుర్గం(మెదక్‌): ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతోనే దేశానికి భద్రత అని బీజేపీ మండల అధ్యక్షుడు యాదగిరి అన్నారు. అల్లాదుర్గం మండల బీజేపీ నూతన అధ్యక్షుడిగా శుక్రవారం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌ నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీతోనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. ఇందులో జిల్లా ఉపాధ్యక్షుడు ప్రభాకర్‌గౌడ్‌ పాల్గొన్నారు.

నేడు మంత్రి సమక్షంలో చేరికలు

కొండపాక(గజ్వేల్‌): కొండపాక మండలంలోని దుద్దెడలో గల ఓ ప్రైవేటు ఫంక్షన్‌ హాల్లో శనివారం మండలంలోని వివిధ గ్రామాల బీఆర్‌ఎస్‌ ముఖ్య నాయకులు, కార్యకర్తలు మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ సమక్షంలో కాంగ్రెస్‌ పార్టీలో చేరుతున్నట్లు కాంగ్రెస్‌ నాయకుడు అనంతుల నరేందర్‌ తెలిపారు. ఉదయం 8 నుంచి 9 వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి కాంగ్రెస్‌ పార్టీ జిల్లా అధ్యక్షుడు తూంకుంట నరేందర్‌ తదితరులు హాజరవుతారని తెలిపారు.

వందే శివం శంకరం..

జిల్లా వ్యాప్తంగా శుక్రవారం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయాలు శివ నామస్మరణతో మారుమోగాయి. ఈ సందర్భంగా తెల్లవారుజాము నుంచే భక్తులు శివాలయాల్లో పరమేశ్వరుడికి అభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు, అలంకరణ చేశారు. ఉపవాస దీక్ష చేపట్టిన భక్తులు ఆలయాలకు వెళ్లి శివయ్యను దర్శించుకొని ఉపవాస దీక్షను విరమించారు. అనంతరం సాయంత్రం ఆలయాల్లో నిర్వహించిన దీపారాధన కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని భజన కార్యక్రమాలను నిర్వహించారు.



నర్సాపూర్‌ రూరల్‌: గొల్లపల్లిలో పూజలు చేస్తున్న భక్తులు



నర్సాపూర్‌లోని శివాలయంలో స్వామివారికి హారతి ఇస్తున్న ఆలయ అర్చకుడు



నిజాంపేట(మెదక్‌): నందిగామలో..



రామాయంపేట(మెదక్‌): గుల్వర్తి శివాలయంలో..



స్వామివారి కల్యాణోత్సవంలో భక్తజనం



కొడిపల్లి(నర్సాపూర్‌): ఆంజనేయస్వామి ఆలయంవద్ద ..



మనోహరాబాద్‌(తూప్రాన్‌): మల్లన్న దేవాలయంలో..



కొల్చారం(నర్సాపూర్‌): రంగంపేట సంగమేశ్వరాలయంలో..



చిలప్‌చెడ్‌(నర్సాపూర్‌): చండూర్‌లో ..



మెదక్‌: హవేళిఘనాపూర్‌ మండలం సిద్దేశ్వరాలయంలో..



చిన్నశంకరంపేట(మెదక్‌): సోమేశ్వరాలయం వద్ద 108 జంటలతో రుద్రాభిషేకం



టేక్మాల్‌(మెదక్‌): బొడ్మట్‌పల్లి వీరభద్రాలయంలో..



హవేళిఘణాపూర్‌(మెదక్‌): భక్తులకు పండ్లు పంపిణీ చేస్తున్న యువకులు

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

మున్సిపల్‌ చైర్మన్‌ అశోక్‌గౌడ్‌

నర్సాపూర్‌: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని మున్సిపల్‌ చైర్మన్‌ అశోక్‌గౌడ్‌ అన్నారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం మున్సిపల్‌ చైర్మన్‌ మహిళా ఉద్యోగులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు ప్రస్తుతం అన్ని రంగాల్లో పురుషులకు దీటుగా రాణిస్తున్నారని అన్నారు. మహిళలు అభ్యున్నత శక్తిగా ఎదగాలని ఆకాంక్షించారు. పట్టణంలోని అంగన్‌వాడీ టీచర్లు, మెప్మా ఉద్యోగులు, మున్సిపాలిటీలో పని చేసే మహిళలను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ మేనేజర్‌ మధుసూదన్‌, కౌన్సిలర్‌ రాంచందర్‌ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకి సన్మానం

చిలప్‌చెడ్‌(నర్సాపూర్‌): మహిళా దినోత్సవం సందర్భంగా నర్సాపూర్‌ ఎమ్మెల్యే సునీతారెడ్డిని శుక్రవారం ఘనంగా సన్మానించారు. మండల పరిధిలోని అజ్జమర్రి గ్రామ మాజీ సర్పంచ్‌ పరశురాంరెడ్డి, గ్రామ యువకులు ఎమ్మెల్యేని హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలసి, పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు మహిపాల్‌, రాజు, శ్రీశైలం, షకీల్‌, శివాజీ, అఖిల్‌, మహేందర్‌, మల్లేశ్‌, శశివర్ధన్‌, రాజ్‌కుమార్‌, రంజిత్‌ తదితరులు పాల్గొన్నారు.

కొడిపల్లి(నర్సాపూర్‌): మండల కేంద్రమైన కొడిపల్లిలోని సీఎస్‌ఐ చర్చిలో అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా పాస్టర్‌ జైపాల్‌ ఆధ్వర్యంలో మహిళలు కేక్‌ కట్‌చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌ బీస కాంత, సంఘ సభ్యులు అనురాధ, ప్రియ, నాగజ్యోతి, సునీత, భారతి పాల్గొన్నారు.

రాయిలాపూర్‌లో..

రాయిలాపూర్‌ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం మహిళ దినోత్సవాన్ని హెచ్‌ఎం బోయిని క్రిష్ణ ఆధ్వర్యంలో నిర్వహించి మహిళ సమాఖ్య సభ్యురాలు మంజులను శాలువ పూలదండతో సన్మానించారు.



ఎమ్మెల్యే సునీతారెడ్డిని సన్మానిస్తున్న అజ్జమర్రి గ్రామస్తులు



కొడిపల్లి(నర్సాపూర్‌): కేక్‌ కట్‌ చేస్తున్న మహిళలు



నర్సాపూర్‌లో మహిళా ఉద్యోగులను సన్మానిస్తున్న మున్సిపల్‌ చైర్మన్‌ అశోక్‌గౌడ్‌

శివలింగానికి నాగపడిగ బహూకరణ

చేగుంట(తూప్రాన్‌): మండలంలోని ఉల్లితిమ్మాయిపల్లి రాజరాజేశ్వర దేవాలయంలోని శివలింగానికి దాత భాస్కర్‌రెడ్డి రెండున్నర కేజీల వెండి నాగపడిగను బహూకరించారు. శివరాత్రి సందర్భంగా ఆలయంలో అభిషేకం నిర్వహించిన అర్చన భాస్కర్‌రెడ్డి దంపతులు నాగపడిగను అలంకరించారు. దానిని దాచి ఉంచేందుకు ప్రత్యేకంగా లాకర్‌ను సైతం ఆలయ నిర్వాహకులకు అందించారు. శివరాత్రి సందర్భంగా మండలంలోని పలు శివాలయాల్లో భక్తులు అర్చన కార్యక్రమాలు నిర్వహించి సాయంత్రం ఉపవాస దీక్షను విరమించారు.



ఉల్లితిమ్మాయిపల్లి ఆలయంలో నాగపడిగను బహూకరిస్తున్న అర్చన భాస్కర్‌రెడ్డి దంపతులు



సౌండ్‌ బాక్స్‌ను అందిస్తున్న భక్తులు

సౌండ్‌ బాక్స్‌ అందజేత

నిజాంపేట(మెదక్‌): మండల పరిధిలోని రాంపూర్‌ గ్రామంలో శుక్రవారం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని పెద్దమ్మ ఆలయానికి గ్రామ తాజా మాజీ సర్పంచ్‌ రజిత దంపతులు సౌండ్‌ బాక్స్‌ సెట్‌ను అందజేశారు. కార్యక్రమంలో రుద్రారం భూమా గౌడ్‌, జెల్లా వెంకట్‌ గౌడ్‌, బాలరాజు గౌడ్‌, చంద్ర గౌడ్‌, స్వామి, సిద్ధయ్య, కేశాల రాములు, పొన్నబోయిన యాదగిరి, రాములు, బాలయ్య, లక్ష్మణ్‌, ముదిరాజులు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చిన్నశంకరంపేట(మెదక్‌): మండలంలోని కోయ్యమర్రి తండాలో చెట్టుపై నుంచి ప్రమాదానికి గురైన గుర్తు తెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. గత నెల 29న ప్రమదానికి గురైన వ్యక్తి మెదక్‌ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ.. గురువారం రాత్రి మృతి చెందాడు. ఆస్పత్రిలోని మార్చురీలో శవం భద్రపరిచినట్లు, ఎవరైన గుర్తించినటలెతై ఫోన్‌నంబర్‌ 87126 57937లో సంప్రదించాలని ఎస్‌ఐ నారాయణగౌడ్‌ తెలిపారు.



మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

జాతర సందడి.. అద్దెకు ఎడ్లబండి



అద్దెకు తెచ్చిన ఎడ్లు, బండితో భూపాల్‌

పాపన్నపేట(మెదక్‌): ఒకప్పుడు పల్లెల్లో ఇంటింటా ఎడ్ల బండ్లు ఉండేవి. యాంత్రిక యుగంలో దాదాపు కనుమరుగయ్యాయి. కాని ఆచార వ్యవహారాలు, జాతరలు, అంగళ్లు కొనసాగుతూనే ఉన్నాయి. దీంతో తప్పని పరిస్థితిలో వ్యయ ప్రయాసల కోర్చి ఎడ్లు, బండ్లను అద్దెకు తెచ్చుకొని జాతరలో బండ్లు తిప్పడానికి సిద్ధమవుతున్నారు. పాపన్నపేట మండలం ఎల్లాపూర్‌కు చెందిన భూపాల్‌ ఏటా ఏడుపాయల జాతరలో ఎడ్లబండి తిప్పుతాడు. అయితే తన వద్ద లేకపోవడంతో ఆచారాన్ని కొనసాగించడానికి టేక్మాల్‌ మండలం తంపులూర్‌లోని ఓ రైతు వద్ద సుమారు రూ.10 వేల ఖర్చుతో అద్దెకు ఎడ్లు, బండ్లు తీసుకొచ్చాడు. శనివారం ఏడుపాయల జాతరలో తిప్పేందుకు సిద్ధమయ్యాడు.

మహిళలకే అధిక ప్రాధాన్యం

నర్సాపూర్‌: 'ఈ బాజా సై ఇండియా' పోటీల్లో మహిళల సంఖ్యను పెంచాలన్న లక్ష్యంతో తమ వంతు కృషి చేస్తున్నామని శ్రీవిష్ణు ఎడ్యుకేషనల్‌ సొసైటీ చైర్మన్‌ విష్ణురాజు అన్నారు. సొసైటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న స్థానిక బీవీ రాజు ఇంజనీరింగు కాలేజీలో శుక్రవారం అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకొని సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన విష్ణురాజు మాట్లాడారు. మహిళలతో పెట్టుబడులు పెట్టండి, పురోగతిని వేగవంతం చేయండి అనే థీమ్‌తో ఐక్యరాజ్య సమితి ప్రస్తుత సంవత్సరాన్ని ప్రకటించిందని గుర్తు చేశారు. తమ సొసైటీ ఆధ్వర్యంలో మహిళల కోసం రెండు ఇంజనీరింగు కాలేజీలను ప్రారంభించామని ఆయన వివరించారు. సమావేశంలో బ్రాండ్‌ స్ట్రాటజిస్ట్‌ అండ్‌ ఇండియన్‌ నేషనల్‌ ర్యాలీ డ్రైవర్‌ శివాని పర్మార్‌, హీరో మోటో కార్ప్‌ బ్యాటరీ సెల్‌ ఇంజనీర్‌ ఖుష్బు గుప్తా, రెనాల్ట్‌ నిస్సాన్‌ టెక్‌ డిప్యూటీ జనరల్‌ మేనేజర్‌ దీప్తి సింగ్‌, టాటా మోటార్స్‌ సీనియర్‌ మేనేజర్‌ గున్నం లాస్య, రెనాల్ట్‌ నిస్సాన్‌ డిప్యూటీ జనరల్‌ మేనేజర్‌ గాయత్రీ కెంబురు, బీవీఆర్‌ఐటీ హెచ్‌ఓడీ సుజన, కాలేజీ ప్రిన్సిపాల్‌ సంజయ్‌ దూబె, డైరెక్టర్‌ లక్ష్మీప్రసాద్‌, ఆయా విభాగాల అధిపతులు రాయుడు, మురళీ, మధుబాబు, వరుణ్‌, ప్రతినిధులు కాంతారావు, బాపిరాజు, అశోక్‌రెడ్డి, సురేశ్‌ పాల్గొన్నారు.



టెస్ట్‌ డ్రైవ్‌ చేస్తున్న సొసైటీ చైర్మన్‌ విష్ణురాజు

ఈబాజా పోటీల్లో టెస్ట్‌ డ్రైవ్‌ పూర్తి

నర్సాపూర్‌: ఈబాజా సై ఇండియా పోటీల్లో భాగంగా శుక్రవారం వాహనాల టెస్ట్‌ డ్రైవ్‌ నిర్వహించారు. పట్టణంలోని బీవీ రాజు ఇంజనీరింగు కాలేజీలో ఈబాజా సై ఇండియా జాతీయ స్థాయి పోటీలు మూడు రోజుల క్రితం ప్రారంభమయ్యాయి. కాగా పోటీల కోసం ఏర్పాటు చేసిన ట్రాక్‌పై ఈబాజా వాహనంపై విష్ణు ఎడ్యుకేషనల్‌ సొసైటీ చైర్మన్‌ విష్ణురాజు టెస్ట్‌ డ్రైవింగ్‌ చేశారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్‌ సంజయ్‌ దూబె, డైరెక్టర్‌ లక్ష్మీప్రసాద్‌, కాలేజీ ప్రతినిధులు కాంతారావు, బాపిరాజు, అశోక్‌రెడ్డి, సురేశ్‌, పలువురు హెచ్‌ఓడీలు పాల్గొన్నారు. ఇదిలాఉండగా సొసైటీ చైర్మన్‌ విష్ణురాజు తమ కాలేజీలో ఏర్పాటు చేసిన జాతీయ స్థాయి పోటీల ఏర్పాట్లను పరిశీలించారు. పోటీలకు హాజరైన ఆయా కాలేజీల విద్యార్థులతో మాట్లాడి భోజన సదుపాయాలు, ఇతర వసతులపై ఆరా తీశారు.